క్లుప్తంగా

'రాజేందర్‌రెడ్డికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి'

ధన్వాడ: నారాయణపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డికి శాసనసభ్యుల కోటా నుంచి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు సుధీర్‌కుమార్‌రావు, మండల నాయకులు మల్లేష్‌గౌడ్, శివారెడ్డి, వడ్ల శాంతికుమార్ కోరారు. గురువారం మండల కేంద్రలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్.రాజేందర్‌రెడ్డి రెండుసార్లు ఎమ్మెల్యేగా నియోజకర్గ అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు.

సీఐగా రాంలాల్ బాధ్యతలు



మక్తల్: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రాంలాల్ గురువారం మక్తల్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో ఎస్‌బీగా పనిచేస్తున్న రాంలాల్ మక్తల్ సీఐగా బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ ఏసీబీ చేతికి చిక్కడంతో.. ఆయన స్థానంలో రాంలాల్ బాధ్యతలు చేపట్టారు.

ఇసుక డంపులు సీజ్

మహమ్మదాబాద్: గండేడ్ మండలంలోని పగిడ్యాల్ వాగులో కొందరు వ్యక్తులు అక్రమంగా ఏర్పాటు చేసిన ఇసుక డంపులను మహమ్మదాబాద్ పోలీసులు గురువారం సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు, తహసీల్దార్ నాగలక్ష్మితో అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన ఇసుకను డంపును గుర్తించారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది సంయుక్తంగా దాడులు చేసి ఈ డంపులను సీజ్ చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు. ఇసుక అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ చైతన్య స్కూల్లో గురువారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్‌గా కార్తీక్, డీఈఓగా ముబ్బసిర్, ఎంఈఓగా మణికంఠ, ప్రిన్సిపాల్‌గా అశ్విని వ్యవహరించారు. అదేవిధంగా పలువురు చిన్నారులు ఉపాధ్యాయ పాత్ర పోషించి చక్కటి విద్యాబోధన చేశారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శనలు, ఉపన్యాసాలు, చక్కటి పాటలు పాడి ఆకట్టుకున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఆత్మకూర్: పట్టణంలోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహంలో తిప్పుడంపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్ వసంత గురువారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి మందులు అందించారు. క్రమం తప్పకుండ పౌష్టికాహారం తీసుకోవాలని, సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ బెనర్జీ, ఆరోగ్య పర్యవేక్షకుడు సురేందర్‌గౌడ్, ఆరోగ్య కార్యకర్త నాగలక్ష్మి, ఆశకార్యకర్తలు, విద్యార్థులు ఉన్నారు.

కళాకారుల పింఛన్ ఇప్పించాలని విజ్ఞప్తి

వీపనగండ్ల: వృద్ధ కళాకారులకు 4 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పింఛన్ డబ్బుల రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని మండల కేంద్రానికి చెందిన నాగస్వర కళాకారుడు మంగళి నారాయణ వాపోయారు. పింఛన్ డబ్బుల కోసం ప్రభుత్వ అధికారులు దగ్గరకు వెళితే తమకు తెలియదని సమాధానం ఇస్తున్నారని వాపోయారు. కనీసం ఉగాది పండుగ నాటికైనా తమకు పింఛన్ డబ్బులు ఇప్పించాలని ఆయన ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

ప్రతిభ చాటిన విద్యార్థికి సన్మానం



మక్తల్: నల్గొండ జిల్లాలో నిర్వహించిన జాతీయ స్థాయి షూటింగ్ బాల్ క్రీడల్లో బంగారు పతకం సాధించిన రాజేష్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం, ప్రిన్సిపాల్ హెస్రీ, పీఈటీ స్వప్న గురువారం మక్తల్‌లో పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మజ, శివకుమార్, శివశేఖర్, మల్లారెడ్డి, చందు, ఖుద్దుస్, శ్రీనివాసులు, మంజుల, అనిత తదితరులు పాల్గొన్నారు.

జల ప్రదాయిని.. పెద్ద చెరువు



మరికల్ పెద్ద చెరువు

- పూర్వీకుల నుంచి ఈ చెరువే ఆధారం
- చెరువు ఎండితే తాగునీటి గోస
- కోయిల్‌సాగర్ నీటితో తీరిన సమస్య

మరికల్: ఆనాడు పెద్దలు నిర్మించిన చెరువులే నేడు గ్రామాలకు నీటి వనరులుగా మారాయి. దాదాపు గ్రామం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ప్రజల దాహార్తితో పాటు పంటలకు సాగునీరు అవసరాలను తీరుస్తూ మరికల్ గ్రామస్తులకు దిక్కుగా నిలిచింది పెద్ద చెరువు. వర్షాభావ పరిస్థితుల వల్ల చెరువు ఎండితే మరికల్ దాహంతో అల్లాడాల్సిన పరిస్థితి ఉండేది. ఇది ఒక్కప్పటి మాట. ప్రస్తుతం కోయిల్‌సాగర్ నీటితో చెరువులను నింపడం ద్వారా మరికల్‌కు ఈ పెద్ద చెరువు జల ప్రదాయనిగా మారింది.

మరికల్ స్వరూపం

తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ఆనాడు గ్రామ పెద్దలు గ్రామం ఈశాన్య భాగంలో వచ్చే పాటు కాల్వలకు అడ్డంగా పెద్ద చెరువు ఆనకట్ట పనులకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో దీని ఆయకట్టు 250 ఎకరాలకు నిర్ధారించారు. ఒకసారి చెరువు నిండితే ఏడాది వరకు గ్రామంలో తాగునీటి సమస్య రాదు. ప్రస్తుతం పెరిగిన జనాభా ప్రకారం మరికల్‌లో 2,500 ఇళ్లు, 20 వేలకు పైగా జనాభా అవసరాలకు నీటిని పెద్ద చెరువు అందిస్తుంది. పెద్ద చెరువు ఒకసారి నిండితే చాలు గ్రామంలో ఉన్న ప్రతి బోరులో పుష్కలమైన నీరు వస్తుంది.

జూరాలతో అనుసంధానం

మాధవరం, మరికల్ మధ్యన కోయిల్‌సాగర్ లింక్ కెనాల్ తవ్వడంతో పై నుంచి వచ్చే పాటు కాల్వలు లింక్ కెనాల్‌లో కలుస్తాయి. కానీ జూరాల నుంచి కోయిల్‌సాగర్‌కు వస్తున్న వరద నీటిని లింక్ కెనాల్ నుంచి దిగువ కాల్వకు మళ్లించడంతో పెద్ద చెరువు నిండుతుంది. మినీ ట్యాంక్‌బండ్ పనుల్లో భాగంగా చెరువును పూడికతీత చేపడితే నీటి నిల్వ సామర్థ్యం మరింత పెరిగే అవకాశం ఉందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

దాహార్తిని తీరుస్తుంది



నాకు 75 ఏళ్లు. పూర్వం మా పెద్దల నుంచి చూస్తున్న పెద్ద చెరువు నిండితేనే గ్రామంలో నీటి సమస్య తీరుతుంది. కరువు కాటకాలు వచ్చి చెరువు నిండకపోతే ఆ ఏడాది మొత్తం గుక్కెడు తాగునీటి కోసం వ్యవసాయ బావులకు పరుగెత్తాల్సిన దుస్థితి ఉంటుంది. నేడు జూరాల నీటితో చెరువును నింపడం వల్ల పదేళ్ల నుంచి తాగునీటికి ఇబ్బంది లేదు.

– తిమ్మన్న, మరికల్

కోయిల్‌సాగర్ నీళ్లు రావడంతో..



15 ఏళ్ల క్రితం వరకు మరికల్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. ఆ సమయంలో జూరాల బ్యాక్ వాటర్ కోయిల్‌సాగర్‌కు వదలడంతో నెల రోజుల పాటు రాత్రిబవళ్లు కష్టపడి చెరువును నింపి అప్పట్లో ప్రజల దాహార్తిని తీర్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇలాగే పెద్ద చెరువును నింపుతుండడంతో గ్రామంలో నీటి సమస్య కనిపించడం లేదు. దీనికి తోడు మిషన్ భగీరథ నీళ్లు రావడంతో సమస్య పూర్తిగా తీరింది.

– రామస్వామి, మరికల్

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



కంసాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేసిన బ్యాగులు

ధన్వాడ: రాష్ట్రీయ గ్రామీణ సాక్షరత్ మిషన్ తెలంగాణ ఇన్‌చార్జ్ నవీనసాగర్ సూచనల మేరకు తెలంగాణ సగర యువజన సంఘం మార్క్ సురేష్ ఆధ్వర్యంలో మండలంలోని కంసాన్‌పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులను చదువులో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన సంఘం కోశాధికారి సాయిగణేష్, ఆంజనేయులు, హనుమంతు, మంకుశసాగర్, హెచ్‌ఎం బాలరాజు, శ్వేత, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, నాయకులు రమేష్‌కుమార్, శేఖర్, సాయికుమార్, రాజు, వెంకటేష్, రాఘవేందర్ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు..

మహాత్మాజ్యోతిరావుపూలే, బీఆర్ అంబేడ్కర్ ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ముందుకు సాగాలని అడ్వకేట్ అయ్యప్ప అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోవర్ధన్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, రామచంద్రయ్య, శివరాజ్, హెచ్‌ఎం నరసింహచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రానికి చెందిన న్యాయవాది అయ్యప్ప ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరత్నమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భరత నాట్య ప్రదర్శన



భరత నాట్య ప్రదర్శన చేసిన చిన్నారులు

మక్తల్: గురురాఘవేంద్ర స్వామి జయంతిని పురస్కరించుకొని కర్నూల్ జిల్లాలోని ప్రముఖ్య పుణ్యక్షేత్రం మంత్రాలయంలో మక్తల్‌కు చెందిన చిన్నారులు భరత నాట్య ప్రదర్శన చేసి పలువురిని అలరించారు. అనంతరం చిన్నారులకు మంత్రాలయ పీఠాధిపతి సుబ్రదేవేంద్ర తీర్థులు ఆశీస్సులు అందించడంతో పాటు అభినందించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గురువు హరతీజ్యోషి, విద్యార్థినులు సాయిసుప్తశ్రీ, ఆరాధ్య, ప్రవస్యప్రసన్న, హాసిని, అక్షిత, మనస్విని, దత్తు, ప్రణవి తదితరులు పాల్గొన్నారు.

భూనీడులో ఎస్‌బీఐ నూతన బ్రాంచ్ ప్రారంభం



ఎస్‌బీఐ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసులు

కొత్తపల్లి: మండలంలోని భూనీడులో ఎస్‌బీఐ నూతన బ్యాంచ్‌ను మేనేజర్ శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో బ్యాంక్ ఏర్పాటు చేయడంపై ఆ శాఖ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యక్తిగత ఖాతాలు తెరవడం కోసం సోమవారం నుంచి పూర్తి స్థాయి సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. డిపాజిట్లు, లాకర్ సౌకర్యం, బంగారం తాకట్టు, వ్యవసాయ రుణాలు, ముద్ర, వ్యక్తిగత, మహిళా సంఘాలకు రుణాలను మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు దేవదాసు, వెంకట్రాములు, వెంకట్‌రెడ్డి, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్‌ను తరిమికొడదాం

- యువతను కాపాడుదాం
- సేవ్ యూత్.. సేవ్ వనపర్తి
- ఎస్పీ రావుల గిరిధర్



పెబ్బేరు రూరల్: మున్సిపాలిటీ కేంద్రంలోని సుభాష్‌చౌరస్తాలో గురువారం సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్, ప్రమాదకర డ్రైవింగ్‌పై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్, సైబర్ స్టాకింగ్, వర్క్ ఫ్రం హోం పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించి అందినకాడికి దండుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి విషయాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు పోయినట్లు గుర్తిస్తే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. నేటి సమాజంలో ఇంటర్నెట్ వినియోగం పెరిగిందని, వాటిపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.

బెట్టింగ్ యాప్స్‌తో జాగ్రత్త

సోషల్ మీడియాను సరైన పద్ధతిలో వాడాలని, అందులో వ్యక్తిగత సమాచారాన్ని పెట్టకూడదని సూచించారు. అదేవిధంగా విద్యార్థులు బెట్టింగ్‌కు సంబంధించిన యాప్‌లకు చాలా దూరంగా ఉండాలని, సైబర్ నేరగాళ్లు మొదట డబ్బు ఆశ చూపి మొబైల్‌లో ఉన్న డాటాను తస్కరించి బ్యాంక్ ఖాతాలో ఉన్న డబ్బులు కాజేస్తారని వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ యువత, విద్యార్థులు డ్రగ్స్, మద్యానికి బానిస కాకుండా ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని సూచించారు. ఎవరైనా గంజాయి తాగుతున్నట్లు, అమ్ముతున్నట్లు తెలిస్తే వెంటనే 100 డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. రోడ్డుపై వాహనాలు నడిపేవారు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, ఎంఈఓ జయరాములు, కౌన్సిల్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ

అమరచింత: విద్యార్థులు క్రీడలతో పాటు చదువుల్లో రాణించాలని ఎంఈఓ భాస్కర్‌సింగ్, మాజీ సర్పంచ్ చుక్క చిన్నఆశిరెడ్డి అన్నారు. మండలంలోని ఈర్లదిన్నె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు స్పోర్ట్స్ గ్రాంట్స్ ద్వారా వచ్చిన క్రీడా సామగ్రిని గురువారం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు శారీరక, మానసిక దృఢత్వం పెంచుకోవాలని సూచించారు. స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు రూ.5వేల నగదు, క్రీడా దుస్తులకు రూ.5 వేలు మాజీ సర్పంచ్ ఆశిరెడ్డి అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిరాజుద్దీన్, వెంకటరాములు, మధు, బాలస్వామి, నాగరాజు, నీరజ, కాత్యాయిని తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీల గెలుపుపై బీజేపీ సంబురాలు



ఆత్మకూర్‌లో తపస్ నాయకులు

అమరచింత: రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్సీల ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందడంపై పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం సంబురాలు నిర్వహించారు. రాష్ట్రంలో బీజేపీ గాలి మొదలైందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటవుతుందని జోస్యం చెప్పారు. అనంతరం బాణాసంచా కాల్చుతూ మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో క్యామ భాస్కర్, దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి, నరాల నారాయణ, రాకేష్‌శెట్టి, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడంతో పట్టణంలోని సుభాష్‌చౌరస్తా వద్ద బాణాసంచా కాల్చి, స్వీట్లు తినిపించుకొని బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమారెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తపస్ ఆధ్వర్యంలో..

ఆత్మకూర్: ఎమ్మెల్సీ స్థానాల్లో మల్క కొమరయ్య, అంజిరెడ్డి గెలుపుపై ఆత్మకూర్, అమరచింత తపస్ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో గురువారం సంబరాలు చేసుకున్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆత్మకూర్ ఎంఈఓ బాలరాజు, అమరచింత ఎంఈఓ భాస్కర్‌సింగ్ ఉపాధ్యాయులకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఒగ్గు ఉమాశంకర్, నారాయణ, కృష్ణయ్య, ఒగ్గు రమేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, మల్లేష్, రామన్‌గౌడ్, శాంతన్న, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి



ఊట్కూరులో కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు

ఊట్కూరు: తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఊట్కూరులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డా.సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో ఎయిడ్స్ నిర్మూలించడానికి సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, వివిధ స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. మార్చి నెలాఖరు వరకు ఎక్కువ మందికి రక్త పరీక్షలు నిర్వహించి ఎయిడ్స్ రహిత సమాజం నిర్మించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. నెల రోజుల పాటు ప్రణాళికాబద్ధంగా వివిద కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సిబ్బంది విజయ్‌కుమార్, నర్సింహులు, సుధాకర్‌బాబు, నర్సింహ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

గురురాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు



స్వామి వారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని పరిమళాపురం వీధిలో గురురాఘవేంద్రస్వామి ఆలయంలో గురువారం స్వామివారి 430వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రస్వామి వారికి విశేష పూజలు, ఆరాధనలు చేశారు. పల్లకీసేవ, మహా రథోత్సవం వైభవంగా జరిపారు. అనంతరం విద్వాన్ ప్రముఖ వేద పండితుడు అనిల్‌దేశాయి ఆధ్యాత్మిక ప్రవచనాలు వినిపించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నరసింహాచారి, రాఘవేంద్ర సేవా సమితి సభ్యులు హరీశ్‌ఆచార్య, అనంతరావు, శేషు, శ్రీపాద్, రవీందర్, సీతారాంరావు, భరత్, ప్రభంజన్ రావు, పద్మనాభ రావు, నారాయణ రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గురురాఘవేద్ర స్వామి భక్తులు కూరగాయల రవికుమార్, వినోద్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదురుగా చలివేంద్రం ప్రారంభించారు. అంతకుముందు ప్రభుత్వ మాడ్యూరల్ చిల్డ్రన్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమరేందర్‌కృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణ బట్టడ్, రాఘవేందర్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

రెండోరోజు కొనసాగిన ఇంటర్ పరీక్షలు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలో ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. విద్యార్థుల యొక్క హాల్ టికెట్లతో పాటు, ఎలక్ట్రానిక్ వస్తువులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అధికారులు పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు చోటు లేకుండా పటిష్టమైనా పోలీస్ బందోబస్తుతో 144 సెక్షన్ అమలులో ఉంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా మొత్తం 3,803 మంది విద్యార్థులకు గానూ 3,732 మంది విద్యార్థులు హాజరై 71 మంది గైర్హాజరయ్యారు. అందులో జనరల్ విద్యార్థులు 3,266 మందికి 3,214 హాజరై 52 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 537 మందికి గానూ 518 మంది పరీక్షలు రాసినట్లు ల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సుదర్శన్‌రావు తెలిపారు. జిల్లా బల్క్ ఇన్‌చార్జ్ జిల్లా కేంద్రంలోని నాలుగు సెంటర్లను సందర్శించారు.

ఊట్కూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం 97 మంది విద్యార్థులకు గాను 93 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలకు సేవ చేయడంతోనే సంతోషం'



గుడెబల్లూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

కృష్ణా: ఏడాది కాలంగా 'శ్రీహరి సేవా సమితి' ఆధ్వర్యంలో యువకులు ఏదోరకంగా ప్రజలకు సేవ చేయడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మండలంలోని గుడెబల్లూర్ రైతువేదికలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ.. యువకులు రాజకీయాలకు అతీతంగా తన పేరుపై సేవ కార్యక్రమాలను నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. 15 రోజల క్రితం ఇదే మండలంలోని కున్సీలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి దాదాపు 100 మందికి పైగా వృద్ధులకు శస్త్ర చికిత్సలతో పాటు ఉచితంగా కళ్ల అద్దాలు అందించారని గుర్తు చేశారు. గతంలో సేవా సమితి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు అవసరమయ్యే సౌకర్యాలు కల్పించామని, చలికాలంలో వృద్ధులకు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మక్తల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, సేవా సమితి వ్యవస్థాపకుడు రవికుమార్, కాంగ్రెస్ నాయకులు రాజప్పగౌడ, కృష్ణామూర్తి, నాగేశ్వర్‌రావు, గుండప్ప, సిద్రాంరెడ్డి, సిద్రామప్ప, నాగప్ప, నారాయణ, శంకర్‌రెడ్డి, సర్వరాజ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



కోస్గిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

ఉచిత కంటి వైద్య శిబిరం

కోస్గి: జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, లయన్స్ క్లబ్ కోస్గి శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గురువారం నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యుడు భాస్కర్‌గౌడ్ 70 మందికి కంటి పరీక్షలు చేయగా.. 28 మందికి కంటిలో శుక్లాలు గుర్తించారు. కంటి శుక్లాలు ఉన్న వారికి పాలమూర్ జిల్లా కేంద్రంలోని లయన్ రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ పూర్ణచందర్ యాదవ్, ప్రతినిధులు వెన్న శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై గ్రామాల్లో సర్వే



మాట్లాడుతున్న ఏఐకేఎస్ నాయకులు

అమరచింత: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు సీపీఎం అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సర్వే చేపడుతున్నామని ఏఐకేఎస్ జిల్లా కోశాధికారి వెంకటేష్ తెలిపారు. మార్చి చివరి నాటికి సమస్యలపై సర్వే నిర్వస్తామన్నారు. మండలంలోని ధర్మాపురం కాలనీల్లో గురువారం తిరుగుతూ సమస్యలు గుర్తించామన్నారు. గ్రామంలో అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకుందని, సీసీ రోడ్ల సమస్య వేధిస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో డ్రెయినేజీల నిర్మాణాలు లేకపోవడంతో మురుగు రహదారులపై పారుతుందన్నారు. సాగునీరు లేక వ్యవసాయ భూములను బీడుగా వదిలేస్తున్నారని, ఎత్తిపోతల పథకం చేపట్టి సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాలు ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో ఏడో తరగతి వరకే పాఠశాల ఉండటంతో ఉన్నత చదువులతో పాటు ఇతర గ్రామాలకు ప్రజలు వెళ్లాలంటే రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మన్యం, బాలకృష్ణ, శంకర్, మోహన్, మహేష్, అశోక్, రాజు పాల్గొన్నారు.